



అడుగులు.. 'వంద'నంగా..

నేటి నుంచి 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ఎమ్మెల్యేల ఇంటింటి ప్రచారం

అధికారం అరాచకమై అయిదేళ్లు కారుచీకట్లు కమ్ముకున్న వేళ.. కాగడా పెట్టి వెదికినా పిసరంతైనా కనిపించని అభివృద్ధి జాడల నడుమ.. జీతాలు అసలు ఎప్పుడు వస్తాయో తెలియని అత్యంత గడ్డు పరిస్థితుల మధ్య.. పల్లె ప్రగతికి ప్రతిరూపాలైన పంచాయతీలను కుళ్లబొడిచి కకావికలం చేసిన పాలన సాక్షిగా.. పేదోడి ఆకలిపైనా రాజకీయ అక్కసు ప్రదర్శించి రాక్షసానందం పొందిన నిరంకుశత్వం బద్దలై ప్రజల ఆకాంక్షల నుంచి ఉదయించిన కూటమి ప్రభుత్వానికి వంద రోజులు పూర్తయింది. ప్రజల ఆకాంక్షలకు పట్టం కడుతూ.. అభివృద్ధే కంకణంగా... ఇచ్చిన హామీలను ఒక్కోటిగా నిజం చేస్తూ.. వైసీపీ అరాచకత్వంతో కుంటుపడ్డ జిల్లాకు మళ్లీ జవసత్వాలు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం జిల్లా రూపురేఖలను మార్చే దిశగా ఈ వందరోజుల్లో వడివడిగా ఎన్నో అడుగులు వేసుకుంటూ కదులుతోంది. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతోంది.

- కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో జిల్లాలో ఎన్నెన్ని మార్పులో
- అయిదేళ్లూ వైసీపీ అరాచకత్వంతో కుంటుపడ్డ జిల్లాకు మళ్లీ జవసత్వాలు
- ఏరోజుకొస్తాయో తెలియని ఉద్యోగుల, పెన్షన్‌దారుల జీతాలు ఠంఛనుగా ఒకటినే జమ
- అరకొర పింఛన్ స్థానంలో పెంచిన పెన్షన్ నేరుగా లబ్ధిదారుల ఇంటికే అందజేత
- అన్న క్యాంటీన్లకు అయిదేళ్ల గ్రహణం వీడి పేదోడి ఆకలి తీర్చుతూ కళకళ
- ఖాళీ ఖజానా నుంచి మళ్లీ ఆర్థిక పరిపుష్టి దిశగా పంచాయతీలు పయనం
- ఈ వందరోజుల్లో జిల్లాలో 385 పంచాయతీలకు రూ.24 కోట్లు ఆర్థిక సంఘం నిధులు జమ
- అటు సూపర్‌సిక్స్ పథకాల్లో మిగిలిన హామీల అమలుకోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో ప్రభుత్వ సచివాలయ ఉద్యోగులు, పెన్షనర్లు కలిపి 20 వేల మందికిపైగానే ఉన్నారు. గత వైసీపీ పాలనలో వీరందరికి అసలు జీతాలు ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితి. అడిగితే అరెస్టులు.. సస్పెన్షన్‌లతో అప్పటి జగన్ ప్రభుత్వం ఉద్యోగులను బెదిరించింది. కేంద్రం అప్పు ఎప్పుడిస్తే అప్పుడు జీతాలుపడే పరిస్థితి. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు పడిన బాధలు వర్ణనాతీతం. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఠంఛనుగా ఒకటో తేదీకే ఉద్యోగులు ఇంకా ఎదురుచూడకముందే జీతాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమైపోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కరోజు కూడా ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు ఆలస్యం కాలేదు. అలాగే ఉద్యోగ విరమణ పొందిన వారికి గత ప్రభుత్వంలో పెన్షన్ సకాలంలో రాక అనేక ఇబ్బందులు పడేవారు. కానీ సీఎం చంద్రబాబు చొరవ, ముందుచూపుతో వారికీ ఒకటో తేదీన జమవుతుండడం పెద్దమార్పు అని ఉద్యోగులంతా ముక్తకంఠంతో చెబుతున్న పరిస్థితి. గత ప్రభుత్వంలో ఉద్యోగులపై వేధింపులు, బూతులు, బెదిరింపులతో స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితులు ఉండేవి కావు. కానీ కూటమి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులు స్వేచ్ఛాయుత వాతావరణంలో విధులు నిర్వహిస్తున్నారు.

ఒకరోజు ముందే...

జిల్లాలో మొత్తం 2.76 లక్షల వృద్ధాప్య, వికలాంగ, వితంతు, ఇతర పింఛన్లున్నాయి. వీరందరికి నెలకు రూ.116 కోట్లు అవసరం. పైగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీరందరికి పింఛన్ల డబ్బులు పెంచింది. అప్పటివరకు ఉన్న రూ.3 వేల పింఛనును రూ.4 వేలు చేసింది. దివ్యాంగులకు రూ.6వేలు, పూర్తిస్థాయి వైకల్యం చెందినవారికి రూ.15వేలు, ఇతర వ్యాధిగ్రస్తులకు రూ.10వేల చొప్పున అందిస్తోంది. వాస్తవానికి నెలనెలా పింఛన్‌ను ఒకటో తేదీనే ఇంటికి వెళ్లి ఇస్తున్నామంటూ గత వైసీపీ సర్కారు వలంటీర్ల ద్వారా హడావుడి చేసేది. ఇచ్చేది తక్కువే అయినా ప్రచారం ఎక్కువగా ఉండేది. కొన్నిసార్లు నిధులు లేక పింఛన్లు రెండో తేదీకి ఇచ్చిన పరిస్థితులు ఉన్నాయి. కానీ కూటమి ప్రభుత్వం ఒకటో తేదీనే సచివాలయ ఉద్యోగుల ద్వారా ప్రభుత్వం పింఛన్లు అందిస్తోంది. ఒకటో తేదీ ఆదివారం వస్తే ఆ ముందురోజే పింఛన్ డబ్బులు అందించి ఆశ్చర్యానికి గురిచేసింది.

ఆకలి తీరుతోంది...

పేదోడి ఆకలి తీర్చడానికి కూటమి ప్రభుత్వం ఆగస్టులో అన్న క్యాంటీన్లు ప్రారంభించింది. జగన్ ప్రభుత్వం వీటికి గ్రహణం పట్టించింది. అధికారంలోకి రాగానే అప్పటి వైసీపీ సర్కారు అన్న క్యాంటీన్లను మూసేసింది. వీటిలో ఆర్‌బీకేలు, సచివాలయాలు ఏర్పాటుచేసి అన్న క్యాంటీన్లపై కక్ష తీర్చుకుంది. కూటమి రాగానే జిల్లాలో మొత్తం ఎనిమిది చోట్ల వీటిని ఏర్పాటు చేసింది. మలివిడతలో త్వరలో మరో కొన్ని ప్రారంభించనుంది. దీంతో ఇప్పుడు ఎక్కడ చూసినా అన్నా క్యాంటీన్లలో పేదలు రూ.5తో ఆకలి తీర్చుకుంటున్నారు. ఒకరకంగా చెప్పాలంటే కూటమి సర్కారు రాకతో అన్న క్యాంటీన్లు ప్రారంభమై పేదల క్షుద్బాధ తీర్చుతుండడం విశేషం.

పంచాయతీలకు మళ్లీ జవసత్వాలు..

జిల్లాలో 385 పంచాయతీలున్నాయి. వీటికి గత అయిదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం నరకం చూపించింది. వీటికి వచ్చే ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించేసింది. కేంద్రం ఇచ్చే డబ్బులను సైతం కాజేసింది. కొన్నిసార్లు నేరుగా కేంద్రం నిధులను పంచాయతీలకు జమచేస్తే వాటిపైనా కన్నేసి విద్యుత్ బిల్లుల బకాయిల పేరుతో లాగేసుకునేది. ఇలా పంచాయతీ వ్యవస్థ మొత్తం నిర్వీర్యమైపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ శాఖ పర్యవేక్షిస్తుండడంతో మళ్లీ పంచాయతీలకు మునుపటి గౌరవం దక్కేలా చేశారు. ఇటీవల జిల్లాలో పంచాయతీలకు రూ.24 కోట్ల వరకు ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. అలాగే జెండావందనం కోసం కేవలం రూ.2 వేలు ఉండే బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం రూ.15వేల నుంచి రూ.25వేల వరకు డ్రాచేసుకునే స్వేచ్ఛ కల్పించింది. అలాగే గ్రామసభలను ఒకేసారి నిర్వహించి రికార్డు సృష్టించింది. గ్రామసభల్లో సమస్యలపై నివేదిక రూపొందించడంతోపాటు విజన్ ప్రణాళికలు కూడా అధికారులు తయారుచేస్తుండడం గొప్ప మార్పే.

అరాచకాలపై ఉక్కుపాదం...

వైసీపీ అయిదేళ్ల పాలనలో రేషన్ బియ్యం స్మగ్లింగ్‌కు కాకినాడ చిరునామాగా మారింది. అనేక రాష్ట్రాల నుంచి ఇక్కడికే రేషన్ బియ్యం దిగుమతయ్యేవి. వీటిని కొందరు వైసీపీ నేతలు తమ మిల్లుల్లో పాలిష్ చేసి కాకినాడ పోర్టు ద్వారా ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తూ వందల కోట్లలో సంపాదించారు. కూటమి ప్రభుత్వం రాగానే రేషన్ మాఫియాపై గురిపెట్టింది. స్వయంగా మంత్రి నాదెండ్ల కాకినాడ పోర్టు, గోదాముల్లోకి వెళ్లి రేషన్ బియ్యం ఆనవాళ్లపై తనిఖీలు చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కొన్ని గోదాములను సీజ్ చేశారు. పోర్టుకు వెళ్లే బియ్యం లారీల్లో రేషన్‌బియ్యం ఆనవాళ్లను పట్టుకోవడానికి పోర్టుకు వెళ్లే రహదారిలో చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. దీంతో రేషన్‌బియ్యం ఎగుమతి చేయాలంటే అక్రమార్కుల్లో భయం పట్టుకునే పరిస్థితిని కూటమి ప్రభుత్వం కల్పించింది.

ఎంత వేగమో...

ఇటీవల ఏలేరు వరద జిల్లాను అతలాకుతలం చేసింది. నాలుగు నియోజకవర్గాల్లో 65 గ్రామాలను వణికించేసింది. వేల ఎకరాల్లో పంటలను నాశనం చేసింది. అదే సమయంలో భారీ వర్షాలు సైతం అపార పంటనష్టం కలిగించాయి. దీంతో గ్రామాల్లో ప్రజలతోపాటు పంటనష్టపోయిన రైతులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఈ తరుణంలో సీఎం చంద్రబాబు నేరుగా కిర్లంపూడిలోని రాజుపాలెం గ్రామానికి వచ్చి బాధితులను ఆదుకునేందుకు నడుంబిగించారు. నష్టపోయిన ఒక్కో కుటుంబానికి రూ.10వేలు ప్రకటించారు. పంట నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.25వేలు ప్రకటించారు. ఇలాంటి సందర్భాల్లో పంటనష్టం నమోదుకు కొన్ని వారాలు పడుతుంది. కానీ సరిగ్గా పదిరోజుల్లో మొత్తం నష్టాన్ని ప్రభుత్వం సిద్ధం చేసి పరిహారం కూడా పంపిణీకి సిద్ధం చేయడం పెనుమార్పుగానే చెప్పాలి.

హామీలన్నీ వరుసగా...

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పథకాలు ప్రకటించింది. అందులో ఒక్కో హామీని వడివడిగా అమలుచేస్తోంది. ఇప్పటికే పింఛన్ల పెంపు అమలు చేసింది. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్ అందివ్వబోతోంది. ఇంటింటికి కుళాయిపైనా సమీక్షించింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపైనా ఇప్పటికే అధ్యయనం దాదాపు పూర్తిచేసింది. గత వైసీపీ ప్రభుత్వం నాసిరకం మద్యం స్థానంలో వచ్చే నెల ఒకటి నుంచి నాణ్యమైన మద్యం విక్రయించడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఉప్పాడ బీచ్ కోతపై ఇచ్చిన మాట ప్రకారం నిపుణులతో పవన్‌కల్యాణ్ అధ్యయనం చేయించారు. అయితే నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, తల్లికి వందనం, ఆడబిడ్డనిధి, కొత్త రేషన్‌కార్డులు, పింఛన్ల అమలు ఎప్పుడు జరుగుతుందో ననే చర్చ ప్రజల్లో జరుగుతోంది. వీటిపైనా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

పాలనలో పూర్తిగా మార్పులు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల కాలంలోనే ప్రభుత్వ పాలనలో పూర్తిగా మార్పులు వచ్చాయి. ఇచ్చిన మాట ప్రకారం 1వ తేదీన పింఛన్లు అందించారు. పోలవరం, అమరావతికి నిధులు రాబట్టారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో పాలన బాగుంది. గత వైసీపీ పాలనలో అంతా గందరగోళం.

- తెలగరెడ్డి భద్రరావు, మల్లేపల్లి, గండేపల్లి మండలం

పెంచిన పింఛనుతో భరోసా



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ల సొమ్మును పెంచి పేదల జీవితాల్లో వెలుగులు నింపింది. గత వైసీపీ పాలనను మరిపించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలిస్తున్నారు. ఈ పెరిగిన పింఛను మాలాంటి కుటుంబాలకు భరోసాగా ఉంది.

- పోలిశెట్టి ఏసుమణి, వితంతు పింఛనుదారు, కరప

కూలిపని చేసుకునే వారికి వరం



కూలిపని చేసుకునే మాలాంటి వారికి అన్నక్యాంటీన్ వరంలాంటిది. అయిదు రూపాయలకే భోజనం, టిఫిన్ చేస్తున్నాం. గతంలో హోటళ్లలో టిఫిన్, భోజనం చేయాలంటే కూలి సొమ్ముల్లో సగం వాటికే పోయేది. ఇప్పుడు 15 రూపాయల్లో మూడు పూటలా కడుపు నిండా తింటున్నాం.

- మొక్కలపేట వెంకటేష్, మోహన్‌నగర్, పిఠాపురం

నేటి నుంచి ఆరు రోజులు..

జిల్లాలో శుక్రవారం నుంచి ఆరు రోజులపాటు 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట ఎమ్మెల్యేలు ఇంటింటి ప్రచారానికి వెళ్లనున్నారు. కేంద్రం, రాష్ట్రం చేసిన పనుల వల్ల ప్రజలకు ఎలాంటి మేలు జరుగుతోందనే విషయాన్ని చెప్పడంతోపాటు భవిష్యత్తులో చేయబోయే కూటమి ప్రభుత్వ కార్యక్రమాల గురించి వివరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ నాయకురాలు, ఎంపీ పురందేశ్వరి ఇప్పటికే పిలుపునివ్వడంతో అన్నిచోట్లా ఈ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి వెళ్లేవిధంగా ఈ కార్యక్రమం సాగేందుకు ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ప్రజలకు మెరుగైన పాలన : చినరాజప్ప

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ వంద రోజుల్లోనూ బుడమేరు, ఏలేరు వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలను సైతం అధిగమించి ప్రజలకు మెరుగైన సేవలందించడం, ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేయడంలో ఎంతో కృషిచేసి ప్రజల ఆదరాభిమానాలు అందుకుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. పెంచిన పింఛన్ల పంపిణీతోపాటు పంచాయతీలకు నిధులు కేటాయింపు, రైతులకు వేగంగా నష్టపరిహారం చెల్లింపు ప్రభుత్వ విజయాలని చెప్పారు.

ప్రజల్లో అభద్రతాభావం తొలగింది : వనమాడి

కూటమి ప్రభుత్వం రాకతో ప్రజల్లో అభద్రతాభావం తొలగింది. గత ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు భరోసా కల్పించామని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చెప్పారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం : యనమల దివ్య

ఇచ్చిన మాట నిలబెట్టుకునే దిశగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతోంది. తేటగుంటలో 3000 కిలోమీటర్ల పైలాన్ ఆవిష్కరణ సందర్భంగా అన్న క్యాంటీన్లు తెరుస్తామని లోకేశ్ ఇచ్చిన మాట అమలై, అన్నార్తులకు కడుపునింపుతోందని ఎమ్మెల్యే యనమల దివ్య చెప్పారు.

వందరోజుల పాలన అత్యద్భుతం : సత్యప్రభ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రజా ప్రభుత్వ పాలన ఎంతో అభివృద్ధి దిశగా ఎన్నో అడుగులు వేసింది. వందరోజుల పాలన అత్యద్భుతమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పేర్కొన్నారు.

వంద రోజుల పాలన వివరిస్తాం : నానాజీ

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి వారం రోజులపాటు కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలకు వివరించడం, రాబోయే రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాలపై ప్రజలకు వివరించడం జరుగుతుందని ఎమ్మెల్యే పంతం నానాజీ చెప్పారు.

విజన్-2047కు ప్రణాళికలు రూపకల్పన చేయాలి

- జిల్లా కలెక్టర్లతో సీఎస్ సమీక్ష

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 19: స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు సంబంధించి జిల్లా మండల కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అమరావతి నుంచి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ షాన్‌మోహన్, కమిషనర్ భావన, జిల్లాజేసీ రాహుల్ మీనా, వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. కాన్ఫరెన్స్ తర్వాత కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులతో మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047విజన్‌కు సంబంధించి జిల్లా కార్యాచరణ ప్రణాళికను అక్టోబరు 15నాటికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనలో చేర్చాల్సిన ప్రధాన అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. గ్రామసభలు నిర్వహించాలన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో 2024-25 నుంచి 2028-29 వరకు విజన్ ప్లాన్‌కు నివేదిక సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో, పరిశ్రమలు, మానవ వనరులు, వైద్య, విద్యావిధానం, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

స్వచ్ఛ సాగర్.. సురక్ష సాగర్ కరపత్రం ఆవిష్కరణ

- రేపు కాకినాడ బీచ్‌లో 'మన తీరం - మనమే శుభ్రం చేసుకోవాలి' కార్యక్రమం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 19: అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఈనెల 21న తీరం వెంబడి చేపట్టనున్న స్వచ్ఛసాగర్.. సురక్ష సాగర్ కార్యక్రమం కరపత్రాన్ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆవిష్కరించారు. కాకినాడలోని దుమ్ములపేటలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మన తీరం మనమే శుభ్రం చేసుకోవాలనే నినాదంతో దేశవ్యాప్తంగా జరిగే ఈ అధికారిక కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఆంధ్రరాష్ట్ర తీర ప్రాంతంలో 974 కిలోమీటర్ల మేర 47 బీచ్‌ల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారన్నారు. కాకినాడ నగరం 10వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి చోడిపల్లి సతీష్ మాట్లాడుతూ శనివారం ఉదయం కుంభాభిషేకం బీచ్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొననున్నారన్నారు. టీడీపీ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్ పాల్గొన్నారు.

ఎండుతున్న వరి పంట

- సాగు నీరందక బీటలు వారుతున్న పొలాలు
- పుష్కర కాలువ ద్వారా నీటి సరఫరా నిలుపుదల
- ఎగువ ప్రాంతాల్లో గండ్లే కారణం

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 19: నిన్న, మొన్నటి వరకూ అధిక వర్షాలు, వరదలతో అన్ని ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. పంటపొలాలు ముంపునకు గురై ఎనలేని నష్టం సంభవించింది. రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. అందుకు భిన్నమైన పరిస్థితి ఇక్కడ. సాగునీరు అందక వరి పంట ఎండిపోతోంది. పొలాలు బీటలు వారుతున్నాయి. ఎండ తీవ్రత గణనీయంగా ఉండడంతో పంట పూర్తిగా ఎండిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గొల్లప్రోలు మండలం దుర్గాడ పరిసర గ్రామాల్లో వరి, తదితర పంటలు ఎండిపోతున్నాయి. ఇక్కడ పుష్కర కాలువ ద్వారా గోదావరి జలాల ఆధారంగా పంటలు సాగు చేస్తారు. క్రమం తప్పకుండా వచ్చే నీటితో వర్షాలు కురవకున్నా పంటలు పండుతుండడంతో రైతులు ఎక్కువగా మెట్ట పంటల కంటే వరిపైనే మొగ్గు చూపిస్తారు. ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట దశకు దగ్గరలో ఉంది. ఈ సమయంలో సాగునీరు అత్యంత అవసరం. ఇటువంటి తరుణంలో పుష్కర కాలువ ద్వారా సాగునీటి సరఫరా నిలిచిపోయింది. రెండు వారాలుగా ఇదే పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ఐదురోజులుగా వేసవిని తలపించేలా ఎండలు కాస్తున్నాయి. దీనితో వరి పంట ఎండిపోతోంది. ఎక్కడికక్కడ పొలాలు బీటలు వారుతున్నాయి. దుర్గాడ, పరిసర గ్రామాల్లో 200 ఎకరాల్లో వరి పంట ఎండిపోయే పరిస్థితికి చేరుకుంది. ఇప్పుడు నీరు అందకుంటే పంట పూర్తిగా ఎండిపోయే అవకాశం ఉంది.



గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఎండిపోతున్న వరి పంట

ఎగువ ప్రాంతాల్లో గండ్లు వల్ల..

పుష్కర కాలువలకు ఎగువ ప్రాంతాల్లో గండ్లు పడడం కారణంగానే సాగునీటి సరఫరా నిలిచిపోయినట్లు చెబుతున్నారు. గండేపల్లి సమీపంలో మూడు చోట్ల గండ్లు పడ్డాయి. పలుచోట్ల భారీవర్షాలకు కాలువలు దెబ్బతిన్నాయి. వీటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించాల్సిన పుష్కర అధికారులు ఆ విషయాన్ని విస్మరించారు. సాగునీటి సరఫరాను నిలిపివేసి పనులు సంగతిని పట్టించుకోలేదు. రెండు రోజులక్రితం తాత్కాలికంగా పనులు చేసినా ఇంకా సాగునీరు మాత్రం విడుదల చేయలేదు. దీంతో దుర్గాడ, పరిసర గ్రామాల పొలాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. రెండు రోజుల్లో నీరు అందకుంటే పంటను కోల్పోతామని రైతులు చెబుతున్నారు. ఇప్పటివరకూ పంటపై పెట్టిన పెట్టుబడి అంతా కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏలేరు, సుద్దగడ్డ వరదల కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో రైతులు పంటలను పూర్తిగా నష్టపోయారు. గొల్లప్రోలు మండలంలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇదే మండలంలో ఉన్న దుర్గాడ పరిసర గ్రామాల్లో మాత్రం సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోయిన స్థితి ఏర్పడడం భిన్నమైన పరిస్థితులకు తార్కాణంగా నిలుస్తోంది. పుష్కర ఇరిగేషన్ అధికారులు తక్షణం స్పందించి పంట పొలాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా ధాన్యం సేకరించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 19: జిల్లాలో 2024-25 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణకు అనుసరించాల్సిన విధానాలపై రెవెన్యూ, వ్యవసాయం, పౌరసరఫరాలు, మార్కెటింగ్, జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ఇందుకు రెవెన్యూ, వ్యవసాయం, పౌరసరఫరాలు, మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్టు ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 5.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనాకుగాను, స్థానిక వినియోగం నిమిత్తం 1.04లక్షల మెట్రిక్ టన్నులుపోను 4.41లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం మార్కెట్‌కు రానుందని తెలిపారు. ఇందులో మిల్లర్ల ద్వారా 1.40 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా మిగిలిన 2.74లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా సేకరించాల్సి ఉంటుందన్నారు. గ్రేడ్-ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2320 సాధారణ రకం క్వింటాకు రూ.2300గా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జేసీ రాహుల్‌మీనా, రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, సీతారామారావు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ బాలసర్వతి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, మార్కెటింగ్ ఏడీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

500 అరటిపండ్లకు ఆర్డర్ ఇచ్చి.. రూ.5,300 సొమ్ము చోరీ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 19: అరటిపండ్లకు ఆర్డర్ ఇచ్చి ఓ దుకాణాదారుడి సొమ్ము ఘరానాగా అపహరించిన ఓ ప్రబుద్ధుడు. ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో గురువారం ఈ ఘటన జరిగింది. బాధితుడి కథనం ప్రకారం వివరాలివి. పిఠాపురం రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన సోము గోవిందు సమీప గ్రామమైన ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఓ ఇంటివద్ద రెండునెలలుగా పండ్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం ఆ దుకాణం వద్దకు ఓ వ్యక్తి సూటు, బూటు ధరించి మోటార్ సైకిల్‌పై వచ్చాడు. 500 అరటిపండ్లు కావాలని ఆర్డర్ ఇచ్చాడు. పండ్లను అత్తలాలుగా కోయాలని చెప్పడంతో దుకాణాదారుడు లోపల ఉన్న అరటిగెలలు అత్తలాలుగా కోసే పనిలో నిమగ్నమయ్యాడు. ఈలోగా బయట గోడ స్టాండ్‌కు తగిలించి ఉన్న దుకాణాదారుడి చొక్కాలోని రూ.5300 నగదును మోటార్‌సైకిల్‌పై వచ్చిన వ్యక్తి అపహరించాడు. పండ్లు అత్తాలుగా కోసి ఉంచాలని చెప్పి అక్కడినుంచి ఉడాయించాడు. ఎంతకీ ఆర్డర్ ఇచ్చిన వ్యక్తి రాకపోవడంతో అనుమానం వచ్చి గోడకు తగిలించిన చొక్కాను పరిశీలించగా తన సొమ్ము చోరీకి గురైనట్లు బాధితుడు గుర్తించి లబోదిబోమన్నాడు. అరటిపండ్లకు ఆర్డర్ ఇచ్చి దుకాణదారుడి చొక్కా జేబులో నగదు కాజేసిన వ్యవహారం చర్చనీయాంశమైంది.

పీహెచ్‌సీల్లో పీజీ వైద్యుల నియామకం

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 19: జిల్లాలోని పీహెచ్‌సీల్లో రోగులకు వైద్యసేవలు అందించేందుకు వీలుగా ప్రత్యామ్నాయంగా పీజీ వైద్యులను నియమించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. జీవో ఎంఎస్ నెంబర్ 85కు వ్యతిరేకంగా పీహెచ్‌సీల్లో విధులు నిర్వహిస్తున్న 44 మంది రెగ్యులర్ సివిల్ అసిస్టెంట్ సర్జన్లు వైద్యసేవలకు గైర్హాజరులో ఉన్నారన్నారు. రోగుల వైద్యసేవలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు 38మంది పీజీ వైద్యులను పీహెచ్‌సీల్లో నియమించామన్నారు. వైద్యులు తిరిగి విధుల్లో చేరే వరకు పీజీ వైద్యులు సేవలు అందిస్తారని తెలిపారు.

ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఉచిత ఇసుక విధానం

- అమరావతి నుంచి సీఎం ఆదేశాలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 19: నూతన ఉచిత ఇసుక విధానం అమలులో భాగంగా వినియోగదారులు ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా మరింత సౌలభ్యంతో ఇసుక పొందేందుకు రూపొందించిన ఆంధ్రప్రదేశ్ సాండ్ మేనేజ్‌మెంట్ పోర్టల్‌ను సీఎం చంద్రబాబు గురువారం అమరావతినుంచి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జిల్లా జేసీ రాహుల్ మీనా, గనులశాఖ డీడీ నర్సింహారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వినియోగదారులకు పారదర్శకంగా, త్వరితగతిన ఇసుక అందించేందుకు ఈ యూజర్ ఫ్రెండ్లీ ఆన్‌లైన్ పోర్టల్ దోహదం చేయగలదన్నారు. ప్రజల అవసరాల మేరకు ఇసుక వనరులను అందుబాటులోకి తేవడంతో పాటు ఇసుక తవ్వకం, రవాణా చార్జీలను వీలైనంత కనిష్ఠ స్థాయికి నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. జీపీఎస్ ట్రాకింగ్, సీసీ కెమేరాలు, డ్రోన్లు వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలతో ఇసుక అక్రమాలను పూర్తిగా అరికట్టాలన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యబృందం తనిఖీలు

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 19: కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం 10-12 పడకల ప్రైవేట్‌ఆస్పత్రులను వైద్యఆరోగ్య బృందం సభ్యులు తనిఖీలు చేపట్టారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జెనరసింహనాయక్ ఆధ్వర్యంలో ఆరుగురి బృందంతో కూడిన వైద్యాధికారులు జిల్లాలో 47 ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీలు చేశారు. వైద్యనిబంధనల మేరకు ఆస్పత్రులు, స్కానింగ్ మిషన్లకు రిజిస్ట్రేషన్లు ఉన్నాయా లేవా అనే దానిపై తనిఖీలు చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారాలేదా అనే దానిపై పరిశీలన చేశారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు సమాచారం వచ్చినా, దీన్ని ప్రోత్సహించినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లింగ నిర్ధారణకు పాల్పడినట్లు సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 3365కు సమాచారం అందించాలని కోరారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

శృంగారవల్లభ స్వామి హుండీల ఆదాయం

రూ.19.31 లక్షలు

పెద్దాపురం, సెప్టెంబరు 19: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తిరుపతి శృంగారవల్లభ స్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో గురు వారం తెరిచి లెక్కించారు. 79 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.13,12,116, అన్నదాన హుండీల ద్వారా రూ.6,19,580... మొత్తం రూ.19,31,696 ఆదాయం వచ్చిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. లెక్కింపులో మరిడమ్మ దేవస్థానం సహాయ కమిషనరు చేబ్రోలు రామ్మోహనరావు, దేవదాయ శాఖ ప్రాంతీయ తనిఖీదారు సీహెచ్ ఉదయ్‌బాబు నాయుడు, తిరుపతి గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు మాధురీప్రకాష్‌లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వేద విద్యనభ్యసించిన నిరుద్యోగ యువతకు భృతి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేద విద్యలో ఉత్తీర్ణత పొంది నిరుద్యోగులుగా ఉన్న వారు నెలకు రూ.3వేలు భృతి పొందేందుకు అర్హులు. ఆసక్తి గల నిరుద్యోగ వేద పండితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా దేవదాయ శాఖ అధికారి వి.సోమరాజు తెలిపారు. వేద విద్య సర్టిఫికెట్ నకలు, ఆధార్ నకలు, ఏ విధమైన ఉద్యోగం లేదని స్వీయ ధ్రువపత్రం దరఖాస్తుకు జత చేసి రాజమహేంద్రవరంలోని జిల్లా దేవదాయ శాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5గంటలలోపు అందించాలని సూచించారు. మరింత సమాచారం కోసం 0883-2478375 నెంబరును సంప్రదించాలని కోరారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మృధు హాసిని

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు

గిరిజన విద్యార్థుల ఎంపిక

అడ్డతీగల, సెప్టెంబరు 19: మండలంలోని వేటమామిడి హోసన్నా పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ మృధుహాసిని తెలిపారు. కాకినాడలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అభిషేక్, కునేటి శ్రీను, చెదల విజయ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన పీఈటీ సుందర్‌ను డీన్ ధనసుందర్ అభినందించారు.

పేకాడుతూ పట్టుబడ్డ అన్నవరం దేవస్థానం ఉద్యోగులు

ఇద్దరికి షోకాజ్ నోటీసు

అన్నవరం, సెప్టెంబరు 19: కాకినాడ జిల్లా తుని రూరల్ పరిధిలో నాలుగు రోజుల క్రితం పేకాడుతూ పట్టుబడ్డ అన్నవరం దేవస్థానం ఉద్యోగులు ఇద్దరికి ఈవో రామచంద్రమోహన్ గురువారం షోకాజ్ నోటీసులు ఇచ్చారు. దేవస్థానం ఏఈవో కొండలరావు, సూపరింటెండెంట్ ఐవీ రామారావు గత ఆదివారం కొందరు వ్యక్తులతో కలిసి పేకాడుతూ దొరికిపోగా రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దేవస్థానం ప్రతిష్ఠ మసకబారేలా వ్యవహరించిన వారిద్దరిపై చర్యలు తీసుకుంటూ ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఈవో కోరారు.

డీఈవో ధ్రువీకరణ లేని దరఖాస్తుల తిరస్కరణ

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 19: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుకు దరఖాస్తు చేసిన వాటిలో జిల్లా విద్యాశాఖాధికారి ధ్రువీకరణ లేని వాటిని తిరస్కరిస్తున్నట్టు కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్ తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇప్పటివరకు 14,191 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఓటుకోసం దరఖాస్తు చేసుకున్న వాటిలో కొన్నింటిపై ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరణ చేశారన్నారు. వాటిని తిరస్కరిస్తున్నామని చెప్పారు.

తిరుపతి-శ్రీకాకుళం రోడ్ మధ్య వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, సెప్టెంబరు 19: రానున్న పండుగ రోజులను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు, వారికి మరింత మెరుగైన ప్రయాణ సదుపాయాలు కల్పించేందుకు తిరుపతి-శ్రీకాకుళం రోడ్-తిరుపతి మధ్య సెప్టెంబరు, నవంబరు నెలల్లో వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుపతి-శ్రీకాకుళం రోడ్ (07442) తిరుపతిలో ప్రతి ఆదివారం సాయంత్రం 5.10 గంటలకు బయల్దేరి రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు మీదుగా అర్ధరాత్రి 2.02 గంటలకు రాజమహేంద్రవరం, అర్ధరాత్రి 2.57 గంటలకు సామర్లకోట, తెల్లవారుజామున నాలుగు గంటలకు తుని... అక్కడి నుంచి అనకాపల్లి, దువ్వాడ, సింహాచలం, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా సోమవారం మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుతుంది. ఈ రైలు సెప్టెంబరు 20, 27, నవంబరు 3, 10 తేదీల్లో ప్రతి ఆదివారం బయల్దేరుతుంది.

శ్రీకాకుళం రోడ్-తిరుపతి (07443) ప్రతి సోమవారం సాయంత్రం మూడు గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయల్దేరుతుంది. చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, సింహాచలం, దువ్వాడ, అనకాపల్లి మీదుగా రాత్రి 8.22 గంటలకి తుని, రాత్రి 8.58 గంటలకి సామర్లకోట, 9.45 గంటలకి రాజమహేంద్రవరం ... అక్కడి నుంచి ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట మీదుగా మంగళవారం ఉదయం 8.20 గంటలకి తిరుపతి చేరుతుంది. ఈ రైలు సెప్టెంబరు 21, 28, నవంబరు 4, 11 తేదీల్లో ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్‌లో బయల్దేరుతుంది. సెకండ్ ఏసీ-1, థర్డ్ ఏసీ-2, స్లీపర్-13, జనరల్-6, ఎస్ఎల్ఆర్-2 వెరసి 24 బోగీలతో ఈ రైలు రెండువైపులా రాకపోకలు సాగిస్తుంది. ప్రయాణికులు ఆయా స్టేషన్లలో బుకింగ్ కార్యాలయాల వద్ద రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని రైల్వే ఉన్నతాధికారులు జారీ చేసిన ప్రకటనలో తెలిపారు.

అదీ అడవి పిల్లి

- శ్రీరాంపురం సమీపంలో ట్రాప్ కెమెరాలో గుర్తించాం
- చిరుత పులిని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు: ఇన్‌చార్జి డీఎఫ్‌వో భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 19:

తూర్పు గోదావరి జిల్లా దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోని శ్రీరాంపురం గ్రామ సమీపంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో బుధవారం రాత్రి అడవిపిల్లిని గుర్తించామని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిరుత పులి, అడవి పిల్లి పాదముద్రల్లో చాలా తేడాలుంటాయని ఆమె వివరించారు. అడవిపిల్లి పాదముద్రలు పరిమాణంలో చిరుత పులి పాదముద్రల కంటే చిన్నవిగా ఉంటాయన్నారు. బుధవారం రాత్రి శ్రీరాంపురం, గురువారం కోలమూరుల్లో చిరుతపులి సంచరిస్తున్నట్టు తమకు సమాచారం అందిందన్నారు. దీంతో నిపుణులు వెళ్లి పాదముద్రలను గమనించి... అవి అడవిపిల్లి పాదముద్రలుగా నిర్ధారించారన్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాప్ కెమెరాల స్థానం మార్చామన్నారు. అదనపు ట్రాప్ కెమెరాలను అమర్చి మొత్తం 100 ట్రాప్ కెమెరాలను ఉపయోగిస్తున్నామన్నారు. చిరుతపులిని పట్టుకునేందుకు ఏడు బోనులు అమర్చి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం నివాస ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్టు నిర్ధారణ కాలేదన్నారు. అటవీ శాఖకు అందరూ సహకరించాలని కోరారు. అసత్య ప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. నకిలీ సందేశాలకు పాల్పడిన వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.



ట్రాప్ కెమెరాలో గుర్తించిన అడవి పిల్లి



రాజమహేంద్రవరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

పుష్కరాల నాటికి ఈస్ట్ రైల్వే స్టేషన్ అభివృద్ధి

- రూ.280 కోట్లతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ
- రాజమహేంద్రవరం పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక

ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 19: వచ్చే గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం ఈస్ట్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రూ.280 కోట్లతో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు చేపట్టడానికి కేంద్రానికి డీపీఆర్ పంపినట్టు చెప్పారు. రైల్వే అధికారులు ముందుగా రూ.240 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశారని, భవిష్యత్ అవసరాలు, పార్కింగ్, ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సౌకర్యాల కోసం అదనంగా మరో రూ.40 కోట్లు పెంచి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రధానంగా ఈస్ట్ రైల్వేస్టేషన్ వైపు ఎక్కువగా అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. అలాగే రాజమహేంద్రవరం పట్టణ ముఖచిత్రాన్ని మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉందన్నారు. ట్రాఫిక్ చక్కదిద్దడం, స్వచ్ఛమైన తాగునీరు అందించడం, మురుగునీటి మళ్లింపు, ఇతర అభివృద్ధి పనుల కోసం సమగ్ర సర్వే జరిపి, దానికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టనున్నట్టు చెప్పారు. మధురపూడి విమానాశ్రయం నూతన టెర్మినల్ త్వరలోనే ప్రారంభమవుతుంద పురందేశ్వరి చెప్పారు. రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీ, అయోధ్య, జైపూర్‌లకు విమానాలు నడపాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రిని కోరామన్నారు. వరద బాధితులను మంచి ప్యాకేజీతో రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుందని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ తూర్పు గోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నాడు-నేడు పనుల పూర్తికి రూ.1,400 కోట్లు అవసరం

- పనుల నిర్వహణలో లోపాలు ఉన్నాయి
- సెంట్రల్ మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్‌కు రూ.97కోట్లు బిల్లుల పెండింగ్
- విద్యా శాఖ అకడమిక్ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు



గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 19: రాష్ట్రంలోని పాఠశాలల్లో నాడు-నేడు పనుల పూర్తికి మరో రూ.1,400 కోట్లు అవసరమవుతాయని విద్యా శాఖ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అకడమిక్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు వెల్లడించారు. గత ప్రభుత్వం సెంట్రల్ మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్‌కు రూ.97కోట్లు బిల్లులను పెండింగులో ఉంచిందని చెప్పారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఎ.విజయనగరం, చేబ్రోలు రథంబాట మండల పరిషత్ పాఠశాల, దుర్గాడ, చేబ్రోలు, గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలు, ఎంపీఆర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కొడవలి పాఠశాలల్లో పనులను ఆయన గురువారం తనిఖీ చేశారు. మండలంలోని ఎ.విజయనగరంతో పాటు ఐదు పాఠశాలల్లో పనుల నిర్వహణపై ఫిర్యాదులు అందాయని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 'నాడు-నేడు' కింద జరిగిన పనుల్లో 44 పాఠశాలల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లోపాలు గుర్తించామని చెప్పారు. పాఠశాలల తరగతి గదులకు అవసరమైన కిటికీలు, తలుపులు తదితర పనులను అప్పటి నిర్వాహకులు పూర్తి చేయలేదని తనిఖీల్లో వెల్లడైందన్నారు. డిసెంబరు నాటికి అన్ని పనులు పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. పాఠశాలల్లో 'నాడు-నేడు' కింద మిగిలిన పనులను పూర్తి చేసేందుకు కొత్త విద్యా కమిటీలతో బ్యాంకు ఖాతాలు లింక్ చేయాలని ఆదేశించామన్నారు. 20-30 రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. పర్యటనలో గొల్లప్రోలు ఎంఈవో-2 శివప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గౌతు వెంకటరమణ పాల్గొన్నారు.



ఎ.విజయనగరంలో నాడు-నేడు పనులపై ఆరా తీస్తున్న నాగేశ్వరరావు

'అభయ హస్తం' లబ్ధిదారులకు రిక్తహస్తం

పింఛన్లపై అధికారుల తీరుకు టీడీపీ నేత నిరసన ... వెలుగు కార్యాలయానికి తాళం

అనపర్తి, సెప్టెంబరు 19: వృద్ధులకు న్యాయం చేయలేని కార్యాలయాలు ఎందుకు ఉన్నట్టు? ప్రభుత్వం జీతాలు ఎందుకిస్తోందంటూ టీడీపీ తూర్పు గోదావరి జిల్లా అధికార ప్రతినిధి, కొప్పవరం మాజీ సర్పంచ్ కర్రి వెంకట రామారెడ్డి అనపర్తిలోని వెలుగు కార్యాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన కార్యాలయానికి తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరామారెడ్డి మీడియాతో మాట్లాడుతూ 2009లో అప్పటి ప్రభుత్వం డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న మహిళలతో సొమ్ములు కట్టించుకుని వారికి 60 ఏళ్ల పూర్తయిన తర్వాత 'అభయహస్తం' పేరుతో నెలకు రూ.500 పింఛను ఇవ్వాలని పథకం రూపొందించిందన్నారు. గత ప్రభుత్వం అభయహస్తం పింఛన్లపై దృష్టి సారించకపోవడంతో అనేక మంది అర్హులు పింఛను అందుకోలేకపోయారన్నారు. అప్పట్లో వీరంతా వెలుగు కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. జిల్లావ్యాప్తంగా సొమ్ము చెల్లించి పింఛన్లు అందక అనేక మంది వృద్ధులు ఇబ్బందిపడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొప్పవరం గ్రామంలో అర్హులైన ఐదుగురిని గుర్తించి పింఛను పునరుద్ధరించాలని కోరానన్నారు. నెల క్రితం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నిర్వహించిన వెలుగు అధికారుల సమావేశంలో కూడా నియోజకవర్గంలో వెలుగు పథకం ద్వారా అర్హులై పింఛను రాని వారి జాబితాను రూపొందించాలని కోరినప్పటికీ నేటికీ పట్టించుకోలేదన్నారు. పింఛను మంజూరు చేయకపోతే వారు ఏడాదికి రూ.385 చొప్పున చెల్లించిన సొమ్ములైనా వెనుకకు ఇప్పించాలని కోరినప్పటికీ అదీ జరగలేదన్నారు. ఈ విషయమై అధికారులను ఎన్నిసార్లు ప్రశ్నించినా పొంతన లేని సమాధానాలు చెప్తున్నారన్నారు. గురువారం దీనిపై ప్రశ్నించేందుకు వెలుగు కార్యాలయానికి వెళ్లగా... ఏపీఎం సెలవులో ఉన్నారని తమకేమీ తెలియదని సిబ్బంది చెప్పారన్నారు. అందుకే కోపంతో కార్యాలయానికి తాళాలు వేశానని చెప్పారు.



వెలుగు కార్యాలయానికి తాళం వేస్తున్న మాజీ సర్పంచ్ వెంకట రామారెడ్డి



కంటైనర్‌లో తరలిస్తున్న ఎద్దులు

53 ఎద్దులు ఒక కంటైనర్‌లో...

అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న కొవ్వూరు పోలీసులు

కొవ్వూరు, సెప్టెంబరు 19: సరైన ఆహారం, నీరు అందించకుండా అక్రమంగా తరలిస్తున్న పశువుల కంటైనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... పాయకరావుపేట సంత నుంచి 53 ఎద్దులను తమిళనాడుకు చెందిన కంటైనర్‌లో హనుమాన్ జంక్షన్ తరలిస్తుండగా కొవ్వూరు గామన్ బ్రిడ్జి వద్ద విశ్వహిందూపరిషత్ సభ్యులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొవ్వూరు పట్టణ సిఐ పి.విశ్వం, పట్టణ ఎస్ఐ కె.జగన్మోహన్ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని కంటైనర్‌తో పాటు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పశువులను గోకవరం గోశాలకు తరలిస్తున్నట్టు సీఐ విశ్వ చెప్పారు.



స్వాధీనం చేసుకున్న బియ్యంతో విజిలెన్స్ అధికారులు

9,718 కిలోల

రేషన్ బియ్యం పట్టివేత

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వాహన తనిఖీల్లో భాగంగా విజిలెన్స్, పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులతో కూడిన బృందం గురువారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రధాన తపాలా కార్యాలయం సమీపంలో ఓ వ్యాన్‌ను పరిశీలించింది. 198 బస్తాల్లో సుమారు 9,718 కిలోల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. గొల్లప్రోలుకు చెందిన వాహన యజమాని పడాల నాగ సూర్యనారాయణ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అనపర్తి ప్రాంతంలోని కోళ్ల ఫారాలకు తీసుకెళ్లమన్నట్టు అదే ఊరికి చెందిన వాహన డ్రైవరు ఊట దుర్గాప్రసాద్ చెప్పాడు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.26 లక్షలు ఉంటుంది. వ్యాన్ యజమాని, డ్రైవర్‌లపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, నవీన్‌కుమార్, వలీ, వీరబాబు, సీఎస్‌డీటీ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతర నిఘా కొనసాగుతోందని.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ ఎస్పీ హెచ్చరించారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాపై సమాచారం ఉంటే 8008203261 నెంబరుకి సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

ఆంధ్రావాసి అమెరికాలో మృతి



రమేష్ (పాత చిత్రం)

నల్లజర్ల, సెప్టెంబరు 19: తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన ముత్తిన రమేష్ (40) అమెరికాలో మృతి చెందాడు. అతని సోదరుడు నరేష్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... రమేష్ అమెరికాలోని ఇలినాయిస్ రాష్ట్రం కార్‌బోనలే సిటీలోని సదరన్ ఇల్‌నాయిస్ యూనివర్సిటీలో ఎంఎస్ చదవడానికి 2022లో వెళ్లాడు. ప్రైవేటుగా ఉద్యోగం చేస్తూనే చదువుకుంటున్నాడు. అక్కడి యువతితో రెండేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెతో విభేదించి రమేష్ వేరుగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్లి భోజనం చేసి వచ్చి రూమ్‌లో పడుకున్నాడని అతని స్నేహితులు చెప్పారు. సోమ, మంగళవారాల్లో రమేష్ ఆచూకీ లేకపోవడం, అతడి గది నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా రమేష్ మృతి చెంది ఉన్నాడని, మృతదేహం పాడై ఉందని వివరించారు. అక్కడి పోలీసులే బుధవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గుండెపోటు లేదా బ్రెయిన్ హెమరేజ్‌తో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహన్ని ఇండియా తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మృతుడికి తల్లి పండమ్మ, సోదరులు నాని, నరేష్ ఉన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



నిడదవోలు, సెప్టెంబరు 19: తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు రైల్వే స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటుచేస్తున్న 5వ నెంబరు ప్లాట్‌ఫామ్ సమీపంలో గురువారం సాయంత్రం సుమారు 60 సంవత్సరాల గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్టు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు తెలిపారు. సదరు వ్యక్తి అనారోగ్య పరిస్థితుల వల్ల కానీ, ఇతర కారణాల వల్ల కానీ సహజ మరణం సంభవించి ఉంటుందని ఆయన తెలిపారు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు కాటన్ లుంగీ, కాషాయ రంగు టవల్, మెడలో చిన్న రుద్రాక్షమాల, జంధ్యం ఉన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. మృతుని గుర్తించిన వారు 7013360296, 9948010061 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

డెంగీతో చిన్నారి మృతి



శంఖవరం, సెప్టెంబరు 19: కాకినాడ జిల్లా శంఖవరం గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి ఎమ్మిలి వనజ వారం నుంచీ తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. నాలుగు రోజుల క్రితం రౌతులపూడి సీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో గురువారం సాయంత్రం బాలిక మృతి చెందిందని వైద్యులు చెప్పారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

30.680 కిలోలు స్వాధీనం

గోకవరం, సెప్టెంబరు 19: గంజాయి కలిగి వున్న ఇద్దరు మైనర్ల (మహిళలు)ను గురువారం అరెస్టు చేసినట్టు గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తూర్పు గోదావరి జిల్లా గోకవరం ఆర్టీసీ డిపో సమీపంలోని బమ్మెర పోతన విగ్రహం వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా రెండు సంచుల్లో రూ.1,53,400 విలువైన 30.680 కిలోల గంజాయిని గుర్తించారు. ఒక సెల్‌ఫోన్, రూ.1,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. మైనర్లను ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరికి చెందిన వారిగా గుర్తించి జువనైల్ హోమ్‌కి తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

మున్సిపల్ అధికారుల బదిలీలు

సామర్లకోట సెప్టెంబరు 19: సామర్లకోట మున్సిపాల్టీకి గురువారం ఇద్దరు అధికారులు బదలీలపై చేరుకుని ఆయా సీట్లలో బాధ్యతలు స్వీకరించారు. సామర్లకోట మున్సిపల్ మేనేజరుగా టి.కనకరాజు మండపేట నుంచి బదిలీపై వచ్చారు. మేనేజర్‌గా పనిచేసిన అచ్యుతరాజు తుని మున్సిపాల్టీకి బదిలీ అయ్యారు. సామర్లకోట మున్సిపల్ రెవెన్యూ అధికారిగా కె.శ్యామల గురువారం సామర్లకోటలో బాధ్యతలు స్వీకరించారు. శ్యామల పిఠాపురం మున్సిపాల్టీ నుంచి సామర్లకోటకు బదిలీపై వచ్చారు. వీరిరువురూ మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

'యువత స్వచ్ఛతాహి సేవలో భాగస్వాములు కావాలి'

కాకినాడరూరల్, సెప్టెంబరు 19: యువత స్వచ్ఛతాహి సేవలో భాగస్వాములు కావాలని కాకినాడ నగరపాలక సంస్థ ఈఈ మాధవి సూచించారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల్లో భాగంగా కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత పేరుతో గురువారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నగరపాలక సంస్థ ఈఈ మాధవి, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటూ మనచుట్టుప్రక్కల ఉన్న పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, అధ్యాపకులు డాక్టర్ జాన్ శామ్యూల్, డాక్టర్ హరిరామప్రసాద్, నగరపాలక సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పీఆర్ కళాశాలలో స్వచ్ఛతాహి సేవ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆరోగ్య పరిరక్షణకు స్వచ్ఛత పాటిద్దాం

ఏలేశ్వరం: పర్యావరణ, ఆరోగ్య పరిరక్షణకు స్వచ్ఛత పాటిద్దామని నగర పంచాయతీ ఇంచార్జ్ కమీషనర్ ఆర్.అనూషలక్ష్మీ అన్నారు. గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నుంచి బాలాజీ చౌక్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అలమండ చలమయ్య బూర్లు సత్తిబాబు, శ్రీను, అధికారులు పాల్గొన్నారు.

పెదశంకర్లపూడిలో స్వచ్ఛతా ర్యాలీ

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడి గ్రామం లో గురువారం స్వచ్ఛతా ర్యాలీని నిర్వహించారు. కనకదుర్గ, వినాయకగుడి, ఆంజ నేయ స్వామిగుడి పరిసరాల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టారు. మండల బీజేపీ అధ్యక్షుడు కందా వీరాస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొండంగి : స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. వ్యాసరచన వక్తృత్వం, చిత్రలేఖనం తదితర అంశాల్లో పాఠశాలస్థాయిలో పోటీలు నిర్వహించారు. అన్ని పాఠశాలల్లోని విజేతలతో మండల స్థాయిలో పోటీలు నిర్వహించి జిల్లాకు ఎంపిక చేయనున్నారు. ఎంఈవోలు షేక్ బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి, సీఆర్పీలు ప్రతాప్‌రెడ్డి మీరాసాహెబ్, షీలా పోటీలను పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ రహిత సమాజం మన లక్ష్యం కావాలి

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో గల ఆదిత్య కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా ప్రాంగణాన్ని శుభ్రపరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.ప్రశాంతి, ఎం.శేషసాయి దుర్గ పాల్గొన్నారు.

'క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్'

పెద్దాపురం, సెప్టెంబరు 19: క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చని జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. స్థానిక మహారాణీ కళాశాలలో మండలస్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అండర్ 15,17 విభాగాల్లో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడలపట్ల యువత మక్కువను పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం క్రీడాభివృద్ధికి ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు . ప్రతీఒక్కరూ క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, ఎంఈవో ప్రభాకరశర్మ, బీజేపీ నేత విత్తనాల వెంకటరమణ, సరోజ వాసు, వంగలపూడి సతీష్, కుమారస్వామి పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో నేటి నుంచి టేబుల్ టెన్నిస్ పోటీలు

పెద్దాపురం : స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఈనెల 20నుంచి 22వ తేదీ వరకూ సీబీఎస్ఈ క్లస్టర్ సెవెన్ టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ పోటీలకు ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల్లో ఉన్న 50 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి సుమారు 350మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు. క్రీడాకారులు సుమారు 12విభాగాల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు జేఎన్‌టీ ఫిజికల్ డైరెక్టర్ అనురాధ పరిశీలకురాలిగా వ్యవహరించనున్నారన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలి

కిర్లంపూడి: విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని సర్పంచ్ శ్రీలత, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు అన్నారు. కిర్లంపూడిలో గల కొక్కొండ రామశేషగిరి పంతులు పాఠశాలలో గురువారం బాలుర, బాలికలకు వివిధ క్రీడా పోటీలు ప్రారంభించారు. మండలంలో గల ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఈపోటీల్లో పాల్గొన్నారు. బాలురు 220మంది, బాలికలు 135మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో కుర్ల చినబాబు, తూము కుమార్, టీడీపీ కాళ్ల వెంకటేష్, దాడి గోవిందు, జనసేన ఎల్లపు దొరబాబు, ప్రభాకర్, స్కూల్ వైస్ చైర్మన్ బొండా అరుణ, దాసరి నాగేశ్వరరావు ఉన్నారు.

మల్లేపల్లి విద్యార్థుల ప్రతిభ

గండేపల్లి: మండలంలో మురారి గ్రామంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఇండియా ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీల్లో మల్లేపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.నవీన్‌కుమార్ తెలిపారు.మల్లేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి 17 మంది విద్యార్థులు నియోజకవర్గస్థాయికి ఎంపికయ్యారు. విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్ఎం జి.సుధామాధురి అభినందించారు.

నేడు స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక

సామర్లకోట: సామర్లకోట మండలస్థాయి స్కూల్ గేమ్స్, కాకినాడ జిల్లా గేమ్స్, స్పోర్ట్స్ క్రీడాకారుల ఎంపికలు ఈనెల 20న శుక్రవారం సామర్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగనున్నట్లు సామర్లకోట మండల విద్యాశాఖాధికారులు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎం. వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ 20న బాలురకు, 21న బాలికలకు ఈ ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొంటూ కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్‌ల ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఈ ఎంపికల ప్రారంభ కార్యక్రమాలకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన సదస్సు

గండేపల్లి, సెప్టెంబర్ 19: సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ కంప్యూటింగ్ అనే అంశంపై ఆరు రోజులపాటు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఈనెల 19 నుంచి 25 వరకు జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధి ఎల్.లోవరాజు నిర్వహించనున్నారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ కంప్యూటింగ్‌లో పలు సూచనలు సలహాలను ఈవర్క్‌షాప్‌లో ఇస్తా మన్నారు.

బాణాసంచా తయారీ కేంద్రాలు తనిఖీ

సామర్లకోట, సెప్టెంబరు 19: సామర్లకోట మండలం వేట్లపాలెంలోని పలు బాణాసంచా తయారీ కేంద్రాలను గురువారం సాయంత్రం కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ ఆధ్వర్యంలో పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, లేబర్ వెల్ఫేర్ శాఖలకు చెందిన అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బాణాసంచా తయారీ సంస్థలలో ముందస్తు భద్రతా చర్యలలో భాగంగా అగ్నిప్రమాద నిరోధకాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసారా, లేదా తదితర అంశాలతోపాటూ అధిక పేలుళ్లు కలిగే రసాయనాలతో బాణాసంచా తయారుచేస్తున్నారా, తయారుచేసిన బాణాసంచా అధికంగా నిల్వ ఉంచుతున్నారా, తయారీ సంస్థలలో పనిచేస్తున్న వారికి భద్రతా నిబంధనల మేరకు జాగ్రత్తలు తీసుకున్నారా తదితర అంశాలపై అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

కరప, సెప్టెంబరు 19: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు కలిసి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డునందుకున్న ఈ పాఠశాల పూర్వవిద్యార్థి, కాజులూరు హైస్కూల్ ఉపాధ్యాయుడు చింతా నారాయణమూర్తిని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆధ్వర్యంలో పలువురు వక్తలు మాట్లాడుతూ పలు సేవాకార్యక్రమాలు చేపడుతున్న నారాయణమూర్తిని అభినందించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ, హెచ్ఎం శ్రీనివాస్, స్టాఫ్ సెక్రటరీ మారిశెట్టి రమేష్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్, ఎంఏ అలీమ్, కూటమి నాయకులు పేకేటి దుర్గాప్రసాద్, ఆచంట నాగు, 92-93 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

'హామీలు, అభివృద్ధిపై పుస్తకం'

పిఠాపురం, సెప్టెంబరు 19: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అన్నింటినీ నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబును మాజీ ఎమ్మెల్యే వర్మ మర్యాదపూర్వకంగా కలిసి పుస్తకాన్ని వర్మ అందజేశారు. 100 రోజుల కూటమి పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన ప్రదర్శన


కాకినాడలో చేపట్టిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 19: రాహుల్ గాంధీపై బీజేపీ నేతల అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాకినాడలో కాంగ్రెస్ నాయకులు గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వరకు ఊరేగింపుగా వెళ్లి రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలుచేసిన బీజేపీ నేతలపై కేసులు నమోదు చేయాలని పోలీస్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. కాకినాడజిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మాదేపల్లి చిట్టిబాబు, ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు తుమ్మల దొరబాబు, పిల్లి సత్యవతి చిన్న, మారోతి శివగణేష్, నీరుకొండ సత్యనారాయణ, పీసీసీ ప్రధాన కార్యదర్శి నక్కా సత్యనారాయణ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహంవద్ద కాంగ్రెస్ నిరసన

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో గాంధీ విగ్రహం ఎదుట గురువారం కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ అధినేతరాహుల్ గాంధీపై బీజేపీ, శివసేన పార్టీల నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో పీసీసీ సభ్యుడు ధర్నాలకోట శ్రీను, కొప్పన కోటేశ్వరరావు, కొల్లు వీరగణేష్, కందిమళ్ళ శామ్యూల్ పాల్గొన్నారు

ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు

కరప, సెప్టెంబరు 19: కరప మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనకార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘ కాకినాడజిల్లా అధ్యక్షుడు తోట సూర్యసుబ్బారావు తెలిపారు. స్థానిక చిరంజీవి కళ్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడిగా మల్లిపూడి వీరవెంకటసత్యనారాయణమూర్తి(బాబులు), కార్యదర్శిగా బావిశెట్టి దుర్గాంజనేయ చక్ర మహా రుద్ర సత్యనారాయణ, కోశాధికారిగా నక్కా శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా తెమ్మనబోయిన వీరభద్రరావు, ఉపాధ్యక్షుడిగా చుక్క శ్రీనివాసరావు, ఉప కార్యదర్శిగా కామిరెడ్డి వెంకన్నబాబు, గౌరవ సలహాదారుడిగా పోలిశెట్టి శ్రీనుబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. అనంతరం కెమేరా సృష్టికర్త లాయిస్ డాగ్రే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రైతుల శ్రమదానంతో వెదుళ్ల గడ్డ గండి పూడ్చివేత

కోటనందూరు, సెప్టెంబరు 19: కోటనందూరు మండలం జగ న్నాధపురం శివారు వెదుళ్ల గడ్డకు గండి పడడంతో రైతులు శ్రమదానం తో ఇసుక బస్తాలు వేసుకున్నారు. సుమారు 500ఎకరాలకు సాగునీరు అందుతుంది. గత కొన్ని సంత్సరాలుగా వెదుల్లా గడ్డ గ్రొయిన్స్ పూర్తిగా దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లు తోంది. ప్రభుత్వాలు రైతులు తలరాతలు మారలేదంటూ రైతులు నిధులు సమకూర్చుకుని గండి పూడ్చుకున్నారు.

హత్యా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

కోటనందూరు, సెప్టెంబరు 19: కోటనందూరు మండలం భీమవరపు కోటలో బుధవారం జరిగిన హత్య కేసులో పెద్దాపురం డీఎస్పీ పి.లలిత కుమారి సంఘటన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నిందుతులను అరెస్టుచేసి చర్యలు చేపడతామని సీఐ చేన్నకేశ్వరరావు, ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

కూరగాయల కొట్టు దగ్ధంపై కేసు నమోదు

కిర్లంపూడి, సెప్టెంబరు 19: మండలంలోని బూరుగుపూడి గ్రామంలో వాకాడ సూరిబాబు కూరగాయల కొట్టు ఈనెల 17న ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. సుమారు రూ.5లక్షలు నష్టం వాటిల్లింది. దీనిపై కిర్లంపూడి ఎస్‌హెచ్‌వో ఎన్.వెంకటరమణ గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోట్లాటపై కేసు నమోదు

కోట్లాటపై గురువారం కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి పోలీసుల వివరాల ప్రకారం కిర్లంపూడి ఎస్సీపేటకు చెందిన గుడ్డేటి స్నేహలత ఇంటికొచ్చి సీంబోతుల గణికమ్మ, నూకమ్మ, మరియమ్మ గొడవపడ్డారు. ఆ సమయంలో గణికమ్మ కుమారుడు ప్రసాద్‌కి ఫోన్‌చేసి గొడవ కోసం చెప్పగానే అతను బైక్‌పై వచ్చి అక్కడే ఉన్న స్నేహలత తల్లి పద్మావతిని గుద్దాడు. దీంతో ఆమె ఎడమ చెంపపై గాయం కావడంతో ఆమెను ప్రత్తిపాడు ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం నిమిత్తం ట్రస్ట్‌హాస్పటల్‌కు తరలించారు. పద్మావతిని బైక్‌తో గుద్దిన సమయంలో నలుగురు నిందితులు చంపుతానని బెదిరించారు. స్నేహలత ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ జి.సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచి ప్రభుత్వం ప్రజా వేదిక షెడ్యూల్ విడుదల

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు19: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యలను పరిష్కరించే ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదిక పోస్టర్‌ను జ్యోతుల నెహ్రూ కార్యాలయంలో విడుదల చేసింది. జగ్గంపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వారం రోజులు పాటు సెప్టెంబరు 20 నుంచి 26వ తేదీ వరకు నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు వివరించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమస్యలు వినతిపత్రం రూపంలో అందించాలని కోరారు.

పిఠాపురంలో వినాయక లడ్డూలకు వేలం

పిఠాపురం, సెప్టెంబరు 19: పిఠాపురం పట్టణంలోని మిరపకాయల వీధిలో సిద్ధి వినాయక యువసేన, వర్తక సంఘం ఆధ్వర్యంలో నిలిపిన స్వామివద్ద ప్రసాదంగా ఉంచిన లడ్డూలకు గురువారం వేలం నిర్వహించారు. 27కిలోల విష్ణు గణపతి లడ్డూ ప్రసాదాన్ని వేలంలో కస్తూర్తి శ్రీరామ్, శ్రీచరణ్‌లు రూ.69,999లకు, 45కిలోల లక్ష్మీ గణపతి మహాలడ్డూను సందిన హరిశంర్, శ్రీదత్తలు రూ.45,999లకు, 36కిలోల సిద్ధి వినాయక శక్తి లడ్డూను జలమంచిలి రాజా 22,599లకు దక్కించుకున్నారు. 10వేలు విలువ కలిగిన నోట్లు దండను రూ.20వేలకు పుణ్యమంతుల బాబూరావు, వేయి రూపాయల విలువ కలిగిన రూ.20నోట్ల దండలను కస్తూరి శ్రీరామ్, శ్రీచరణ్‌లు 13,999లకు దక్కించుకున్నారు. అనంతరం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. కమిటీకి రూ.10వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

'ఏలేరు వరద ముంపు నివారణకు చర్యలు చేపట్టండి'

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 10: అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదలశాఖా మంత్రి నిమ్మల రామానాయుడుని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కలిసి ఏలేరు వరద ముంపు నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. వరదలు వచ్చిన తీరు ప్రజలు పడుతున్న ఇబ్బందులను డాక్యుమెంటరీ రూపంలో వారికి చూపించారు. ఇర్రిపాక నుంచి ముక్కోలు వరకు ఏలేరు వరదలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని భారీగా ఆస్తినష్టం, పంట నష్టం కలుగుతుందని వివరించారు. దీనికి రక్షణ చర్యలుగా ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించేందుకు నిధులు సమకూర్చి పనులు ప్రారంభించాలని కోరారు. నీటి పారుదల శాఖ ప్రభుత్వ సలహాదారుడు ఎం. వెంకటేశ్వరరావు కూడా ఎమ్మెల్యే కలిసి పరిస్థితిని వివరించారు.

'పార్లమెంట్ హాల్‌లో
ఏచూరి కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి'


ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 19: పార్లమెంట్ హాల్‌లో ఏచూరి కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని, జిల్లాలో నెలకొల్పే విమానాశ్రయానికి సీతారాం పేరు పెట్టాలని వక్తలు పేర్కొన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను కాకినాడలోని రెవెన్యూ ఎంప్లాయిస్ భవన్‌లో గురువారం నిర్వహించారు. సభకు పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అధ్యక్షత వహించగా కోకన్వీనర్ చింతపల్లి అజయ్‌కుమార్ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీతారాం కాంస్య విగ్రహాన్ని పార్లమెంట్ హాల్‌లో ఏర్పాటుచేసి జిల్లాలో నెలకొల్పే విమానాశ్రయానికి ఆయన పేరు నామకరణం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్, రచయిత గొడవర్తి సత్యమూర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ బీరక చంద్రశేఖర్, మాజీ మేయర్లు సుంకర పావని, సుంకర శివప్రసన్న, ప్రముఖులు ఎండీ జవహర్‌ఆలీ, కె.జాన్‌జోసఫ్, పేపకాయల రామకృష్ణ, జల్లూరి వెంకటేశ్వర్లు, తాటిపాక మధు, మోర్త రాజశేఖర్, దువ్వ శేషబాబ్జి, పెద్దింశెట్టి రామకృష్ణ, గదుల సాయిబాబు పాల్గొన్నారు.

'చిన్నారుల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనత నివారణే ధ్యేయం'

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 19: చిన్నారులు, గర్భిణుల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనత నివారణే ధ్యేయంగా అదానీ ఫౌండేషన్ ద్వారా పార్చ్యూన్ సుపోషన్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు అదానీ విల్మార్ లిమిటెడ్ కాకినాడ క్లస్టర్ హెడ్ మనీష్‌బాగ్‌పాయ్ తెలిపారు. గురువారం సర్పవరం జంక్షన్ స్పందన ఫంక్షన్ హాల్లో అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పార్చ్యూన్ సుపోషన్ ప్రాజెక్టును జిల్లా ఐసీడీఎస్ పీడీ కొండా ప్రవీణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు సమతుల్య పోషకాహారాన్ని తీసుకోకపోవడంతో ఆరేళ్లలోపు చిన్నారులు పౌష్టికాహారలోపం, రక్తహీనత తదితర అనారోగ్య రుగ్మతలకు గురవుతున్నారన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఐసీడీఎస్‌తో భాగస్వామ్యం అయ్యేందుకు ముందుకు వచ్చిన సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. అదానీ విల్మార్ లిమిటెడ్ కాకినాడ క్లస్టర్ హెడ్ మనీష్ బాగ్‌పాయ్ మాట్లాడుతూ కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటుచేసి నిర్వహణ చేయించడం, వాష్ బాస్కెట్‌ల అభివృద్ధి, ప్రత్యేక న్యూట్రిషన్ శిబిరాల ఏర్పాటు, గ్రామస్థాయిలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మూడు అంగన్‌వాడీ కేంద్రాలకో సుపోషన్ సంగిని అమలు చేస్తామని, ఇందులో బరువు యంత్రం, ఇన్‌ఫాంటోమీటర్, స్టేడియోమీటర్‌తో పాటూ అత్యాధునిక టాబ్లెట్‌లను అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో అదాని ఫౌండేషన్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ హెడ్ వివేక్‌యాదవ్, డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ మిర్స్ రోజినా సుల్తానా, విల్మార్ హెచ్‌ఆర్ హెడ్ బగ్గు వెంకటరమణ పాల్గొన్నారు.

నరేంద్రగిరిపై ఆంధ్రా భద్రాద్రి రామాలయ నిర్మాణం పూర్తి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 19: ప్రత్తిపాడులోని నరేంద్రగిరి కొండపై ఆంధ్రాభద్రాద్రి రామాలయ శ్లాబు నిర్మాణ పనులు గురువారం పూర్తయ్యాయి. ఈ శ్లాబు నిర్మాణ పనులు సందర్భంగా శ్రీమద్ రామాయణ పీఠ వ్యవస్థాపక అధ్యక్షుడు గల్ల సుబ్బారావు, బూరుగుపూడి ఆశ్రమఅధిపతి భాస్కరేంద్ర సరస్వతి స్వామీజీలు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తగా భజన కళాకారులు తరలివచ్చి శెట్టిభజనలతో సందడి చేశారు. ఈ సందర్భంగా శ్రీరామనామ క్షేత్రం వ్యవస్థాపకుడు గల్లా సుబ్బారావు మాట్లాడుతూ ఆంధ్రా భద్రాద్రి రామాలయాన్ని 5వేల చదరపు అడుగులు కలిగిన మండపాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థల దాత చలంకూరి భావన్నారాయణ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గోగుల వెంకటేశ్వరరావు, కమిటీ అధ్యక్షుడు రెడ్సం రాజా, సుబ్రహ్మణ్యం, కార్యదర్శి పుష్పారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం స్థానికులు దొరబాబు, పార్వతి, గంగాధర్, తదితరులను ఘనంగా సన్మానించారు.

కూటమి ప్రభుత్వానికి నాయీబ్రాహ్మణులు రుణపడి ఉంటారు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 19: కూటమి ప్రభుత్వానికి నాయీబ్రాహ్మణులు రుణపడి ఉంటారని కాకినాడ నగర నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈమేరకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయాల్లో ట్రస్ట్ బోర్డు సభ్యులుగా కొనసాగుతున్న నాయీబ్రాహ్మణులకు తిరిగి అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. సంఘ నాయకులు చికటాపుల రామారావు, స్వయంవరపు శ్రీనివాసరావు, కొయ్యని ఏసుబాబు, బండారు అప్పారావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: మాజీ మంత్రి యనమల

తుని రూరల్, సెప్టెంబరు 19: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని, శాసన మండలనేత యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. రూ.5లకే పేదలు కడుపు నింపే బృహత్తర కార్యక్రమానికి తునిలో ఆయన శ్రీకారం చుట్టారు. తునిలో పార్క్‌సెంటర్లో గల అన్న క్యాంటీన్‌ని ప్రారంభించిన ఆయన పేదలకు వంటకాలను వడ్డించి, నాయకులతో కలిసి ఆయన రాత్రి భోజనం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గతంలో టీడీపీ పాలనలోనే ఎందరో అన్నార్తులకు ఆకలి తీర్చిన అన్నా క్యాంటీన్లను జగన్ సర్కార్ వచ్చి మూత వేయించిందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్లు యినిగంటి సత్యనారాయణ, కుసుమం చి శోభారాణి, టీడీపీ సీనియర్ నాయకులు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజులు మాట్లాడారు. కార్యక్రమంలో మల్ల గణేష్, అల్లు రాజు, సిద్దాంతపు సత్తిబాబు, జల్లు వాసు, శ్రీనివాసరాజు, పలక సోమేశ్వరరావు, తమరాన సత్యనారాయణ, గజ్జి అప్పలరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తునిరూరల్, సెప్టెంబరు19: పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో కె.శ్రీలత అన్నారు. గురువారం పట్టణంలోని రాజీవ్‌కల్ప, తేటగుంట గ్రామంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ పౌష్టికాహార మహోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీడీపీవో శ్రీలత పాల్గొన్నారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసాదాలు చేశారు. అదనపు సీడీపీవో నిహారిక, సూపర్‌వైజర్ సరస్వతి, విజయలక్ష్మి, నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని రామచంద్రపురంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండారు ప్రసాద్, సూపర్‌వైజర్ బూసమ్మ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 19: నగరంలోని మసీదు సెంటర్ జిలానీ పాన్‌షాప్ వై.జంక్షన్ వద్ద నిర్మించిన అక్రమ కట్టడాలను మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం తొలగించారు. డీసీ హరిదాస్ ఆధ్వర్యంలో నిర్మాణాన్ని తొలగించారు.

ఉమా మనో వికాస కేంద్రానికి 20 ఇనుప మంచాల వితరణ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 19: కాకినాడరూరల్ వాకలపూడి ఉమామనో వికాస కేంద్రంలో గల మానసిక దివ్యాంగుల పిల్లల సౌకర్యార్థం కాకినాడకు చెందిన కాస్మో కిట్టీ పార్టీ సభ్యులు 20 ఇనుపమంచాలు, పరుపులు, దిండులను డాక్టర్ దుర్గరాజు సంస్థకు అందజేశారు.

దివ్యాంగులను యాప్ సహాయంతో గుర్తించాలి

తొండంగి, సెప్టెంబరు 19: దివ్యాంగులు ప్రశస్త యాప్ సహాయంతో పక్కాగా గుర్తించాలని సిఎంఓ చామంతి నాగేశ్వరరావు ప్రధానోపాధ్యాయులకు సూచించారు.గురువారం ఆయన తొండంగి భవిత సెంటర్ ,స్కూల్ కిట్ల స్టాకు పాయింటు పరిశీలించిన అనంతరం విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులంతా ప్రశస్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దాని ద్వారా దివ్యాంగుల వివరాలు నమోదు చేయాలన్నారు.

జె.కొత్తూరు సర్పంచ్ చెక్ పవర్ రద్దు

జగ్గంపేటరూరల్, సెప్టెంబరు19: మండలంలోని జె.కొత్తూరు పంచాయతీ సర్పంచ్ చెక్‌పవర్‌ను మూడు నెలల పాటు రద్దు చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య తెలిపారు. పంచాయతీ నిర్వహణలో భాగంగా పారిశుధ్య సిబ్బందికి, పారిశుధ్య వాహనం డ్రైవర్‌కు జీతాలు చెల్లింపులు చెయ్యనందున, సదరు మొత్తమును గ్రామ పంచాయతీ నిధుల నుంచి డ్రా చేయటంలో విఫలమైనందుకుగాను చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. చెక్ పవర్ అధికారాన్ని డివిజనల్ పంచాయతీ అధికారికి ఇచ్చినట్లు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

జగ్గంపేటరూరల్, సెప్టెంబరు19: జగ్గంపేట గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి డి.హరిశేషు తెలిపారు. ఈ అవకాశాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 700 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, బీటెక్, విద్యార్హతలుగా తెలిపారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జగ్గంపేటరూరల్, సెప్టెంబరు19: జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్‌ఆర్‌ఆర్ కృష్ణన్ తెలిపారు. ఎలక్ట్రీషియన్, పిట్టర్, సివిల్ ట్రేడ్స్ కోర్సులకు ఖాళీలు ఉన్నాయని విద్యార్థులు గమనించాలని కోరారు. దరఖాస్తులను ప్రభుత్వ వెబ్‌సైట్ జీ.జీ.ఐఇజౌరి.జీలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రైతులకు డ్రోన్‌పై అవగాహన

జగ్గంపేటరూరల్, సెప్టెంబరు 19: మండలంలోని గొల్లలగుంట గ్రా మంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు డ్రోన్‌పై మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ అవగాహన కల్పించారు. ప్రస్తుతం డ్రోన్ టెక్నాలజీ రైతులకు ఉపయోగపడుతుందన్నారు. దీనిద్వారా ద్రవ రూప ఎరువులు, నానో యూరియా, నానో డీఏపీ, పురుగు మందులు పిచికారీ ఎంతో సులభతరం అవుతుందని రైతులకు వివరించారు. డ్రోన్ కెపాసిటీని బట్టి ఒక్కరోజులోనే 50నుంచి 60ఎకరాలు పిచికారీ చేయవచ్చని వివరించారు.

కిట్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ మధుకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న మధు

పెద్దాపురం, సెప్టెంబరు 19: మండలంలోని దివిలి కిట్స్ ఫార్మసీ కళాశాల (ఉమెన్) ప్రిన్సిపాల్ గుడిపాటి మధుకు ప్రతిష్టాత్మకమైన అమెరికా డాక్టర్ ఆఫ్ సైన్స్ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. మధు పీహెచ్‌డీ అభ్యసించడానికి యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ (యూజీసీ) ఆర్థిక సహాయాన్ని ఫెలోషిప్ రూపంలో అందించింది. ఫార్మాస్యూటికల్ సైన్సెస్ రంగంలో ఆయన ఇప్పటికే ఆరు పుస్తకాలను రచించారు. కాకినాడ జేఎన్‌టీయూకే వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ సమక్షంలో డాక్టర్ ఆఫ్ సైన్స్ అవార్డును అందుకున్నారు. మధును కళాశాల చైర్మన్ బి.శ్రీనివాసరావు, ఈవో జెన్నిబాబు అభినందించారు.

'పారదర్శకంగా ఓటర్ లిస్టులను తయారుచేయాలి'

పెద్దాపురం, సెప్టెంబరు 19 : రైతుల ఓటర్ లిస్టులను పారదర్శకంగా తయారుచేయాలని ఆర్డీవో జె.సీతారామారావు తహశీల్దార్లు, పుష్కర కాలువ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో పుష్కర, తహశీల్దార్లతో గురువారం రైతుల ఓటర్ల లిస్టుల తయారీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటుకు సంబంధించి ఆయకట్టు కింద ఉన్న రైతుల ఓటర్ లిస్టులను తయారుచేయాలన్నారు. పెద్దాపురం, గండేపల్లి, శంఖవరం, తుని, తొండంగి, జగ్గంపేట నీటి వినియోగదారుల అసోసియేషన్లు ఏర్పాటుచేయాల్సి ఉందని ఈ సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

ఐదుగురు వాహనదారులకు జైలు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 19: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురికి రెండేసి రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కాకినాడ ట్రాఫిక్-1, ట్రాఫిక్-2 పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని ట్రాఫిక్ పోలీసులు చేపట్టారు. మద్యంతాగి వాహనాలు నడుపుతున్నట్లు 15మందిని గుర్తించారు. వీరిని మూడో స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా పదిమందికి తలో రూ.10వేల వంతున జరిమానా విధించారు. ఐదుగురికి రెండేసి రోజుల చొప్పున జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐలు రమేష్, రామారావు తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన వెంకట్రాజు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 19: సంపర మాజీ ఏఎంసీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు కర్రి వెంకట్రాజు గురువారం ఉండవిల్లిలో మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నామినేటెడ్ పోస్టుల భర్తీలో తనకు ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందించారు.

వరద బాధితులకు తుని వాసుల సాయం

తుని రూరల్, సెప్టెంబరు 19: విజయవాడ ప్రాంత ప్రజలకు తునివాసులు సహాయాన్ని అందజేశారు. తుని పట్టణానికి చెందిన పలువురు సేవా తత్పరులు, రోటరీ క్లబ్, రెడ్డి సంక్షేమ సంఘం మిత్రులు కలిసి రూ.3.40లక్షలు సమకూర్చివరద బాధితులకు గ్యాస్‌పొయ్యిలు, స్టీల్ సామాన్లు, దోమతెరలు, దుప్పట్లు, టవల్స్‌తోపాటు కొద్ది మొత్తంలో నగదు విజయవాడ పంపించారు. కె.కిషోర్‌రెడ్డి, రోటరీ అధ్యక్షుడు సీహెచ్ మంగరాజు, సీహెచ్ అయ్యప్ప రెడ్డి, మణికంఠ రెడ్డి, సాయి అన్నపూర్ణ, ఓల్డ్ ఏజ్ హోం నిర్వాహకులు గోపాలరావు, ఉన్నారు.

సీఎంకు చెక్కు అందజేత

జగ్గంపేట, సెప్టెంబరు19: అమరావతిలో సీఎం కార్యాలయం లో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గోకవరం రాజా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అందించిన వరద బాధితుల విరాళం చెక్కును సీఎం చంద్రబాబు నాయుడుకు అందజేశారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా విజయవాడ వరద బాధితులకు ఆహార పదార్థాలు, దుప్పట్లు, మంచినీళ్లు, నిత్యావసర వస్తువులు జగ్గంపేట నియోజకవర్గంలోని అన్నిగ్రామాల నుంచి పంపించినట్లు సీఎంకు ఎమ్మెల్యే తెలిపారు.